నేడు జేఆర్‌సీలో ‘వీ హబ్’ ప్రోగ్రాం

రాయదుర్గం: వీహబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 గంటలకు రాయదుర్గంలోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో ‘వీ హబ్–విమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రామ్, గ్రాస్‌రూట్స్ యూత్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్’ జరగనుంది. రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ధనసరి అనసూయ సీతక్క, పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, వీహబ్ ఫౌండేషన్ సీఈఓ సీత పాల్గొంటారు.

పేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరం

శేరిలింగంపల్లి: సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలు మెరుగైన వైద్యం పొందే వరమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కార్పొరేటర్ వి.జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం నల్లగండ్లలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాదాపూర్ డివిజన్ ఆదిత్యనగర్‌కు చెందిన బాధితుడికి సీఎం రిలీఫ్ ఫండ్ రూ.1.50 లక్షల ఎల్‌ఓసీ అందజేశారు. నాయకులు సాయన్న, రాంచందర్ యాదవ్, మల్లేష్, రెహమాన్, సుధాకర్, యాదయ్య, కోటేశ్వర్‌రావు, లక్ష్మణ్, రామ్, కృష్ణ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



గచ్చిబౌలి: మంచి అలవాట్లతో ఆరోగ్యంగా ఉండవచ్చని కొండాపూర్ టీజీఎస్‌ఎస్‌పీ 8వ బెటాలియన్ కమాండెంట్ ఎం.రామకృష్ణ అన్నారు. శుక్రవారం కొండాపూర్ బెటాలియన్‌లో సిబ్బందికి డాక్టర్ అగర్వాల్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరంలో నేత్రాలు అతి ముఖ్యమైన, సున్నితమైనవని అన్నారు. కంటి చూపు చూపు కోసం మంచి ఆహార అలవాట్లను పాటించాలన్నారు. పోలీసు ఉద్యోగంలో కంటి చూపు ముఖ్యమని నిత్యం వ్యాయామం చేసి బీపీ, మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవాలని సూచించారు. బెటాలియన్, సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ బి.వి.రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్లు ఎస్.రాంబాబు, పార్థసారథిరెడ్డి, నాగభూషణం, యూనిట్ డా. జ్యోతిబా పూలే, అగర్వాల్ ఐ ఆస్పత్రి డాక్టర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కడే, రాగం నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కడే, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌లు ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని కోరారు. పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంటమాలజీ ఎస్ఈ వెంకటరమణి కిరణ్, ఏఈ తనూజ, నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, గోపాల్‌యాదవ్ పాల్గొన్నారు.

‘ప్రతి భారతీయుడూ తిరంగా యాత్రలో పాల్గొనాలి’

గోల్కొండ: ప్రతి భారతీయుడూ తిరంగా యాత్ర లో పాల్గొనాలని బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల ఆటకట్టించి పాక్‌కు గట్టి బుద్ధి చెప్పిన సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్ వద్ద జరగనున్న తిరంగా యాత్ర లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్వాన్, గుడిమల్కాపూర్ తదితర ప్రాంతాల నుంచి తిరంగా యాత్రకు భారీ ఎత్తున ప్రజలు పాల్గొంటున్నారని ఆయన పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో కన్నకూతురి హంతకుడు

గోల్కొండ: 11 రోజుల కూతురిని హత్య చేసిన కసాయి తండ్రి పోలీసుల అదుపులో ఉన్నాడు. కాగా ఇతడిని మరింత లోతుగా విచారిస్తున్నారని తెలిసింది. ఆరేళ్ల క్రితం జగత్ ఖైరతాబాద్‌లో నివసించే వాడు. ఆ సమయంలో కూడా అతడి మొదటి భార్య కుమారుడు అనుమానస్పందంగా మృతి చెందినట్లు తెలిసింది. అయితే గతంలో ఇంకా ఏమైనా నేర చరిత్ర ఉందా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. భార్యతో కూడా తాగిన మైకంలో ప్రతినిత్యం గొడవ పడే వాడని పోలీసుల విచారణలో తేలింది.

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య

- సుశిక్షితులైన ఉపాధ్యాయులు
- ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు
- పుస్తకాలు ఇతరత్రా అన్నా ఉచితం
- ప్రజలను చైతన్యం చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు
- ప్రజల నుంచి పెరుగుతున్న ఆదరణ



హైదర్‌గూడలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



అత్తాపూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు స్థానిక అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ వాణి తదితరులు



సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌ల సభ్యులతో సమావేశం దృశ్యం

అత్తాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచే దిశగా ఉపాధ్యాయులు, అధికార యంత్రాంగం పెద్ద ఎత్తున కృషి చేస్తోంది. సర్కారు బడుల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, సుశిక్షితులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన బోధన, పుస్తకాలు, స్కూల్ యూనిఫాంలు ఇతరత్రా వసతులు కల్పిస్తున్నామంటూ ప్రచారం చేస్తున్నారు. గత విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు సాధించిన ఉత్తమ ఫలితాలను విద్యార్థుల తల్లి దండ్రులకు వివరిస్తూ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతున్నారు.

◆ ఈ నేపథ్యంలో వేసవి సెలవుల్లో జిల్లా కేంద్రాల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి శిక్షణ పొందిన ఉపాధ్యాయులు మండల కేంద్రాలలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు మండల విద్యాశాఖ ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు నిర్వహించే వారు. ఈ విద్యా సంవత్సరానికి ముందు నుంచే బడిబాట కార్యక్రమం ప్రారంభం అయింది. దీంతో విద్యా శాఖ రూపొందించిన కార్యచరణ అమలు చేసేందుకు ఉపాధ్యాయులు ప్రతి శుక్రవారం పాఠశాల పరిసర ప్రాంతాల్లో పరిసర ప్రాంతాల ప్రజలను ఏఏపీసీ చైర్మన్లు, డ్వాక్రా మహిళలు, మహిళా సంఘాలు, అంగన్‌వాడీ టీచర్లు సహకారంతో బడి ఈడు పిల్లలు బయట తిరగకుండా పాఠశాలలో అడ్మిషన్లు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

◆ రాజేంద్రనగర్ మండల విద్యాశాఖాధికారి కేశవత్ శంకర్‌రాథోడ్ మాట్లాడుతూ... మధ్య తరగతి దిగువ మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లలను కచ్చితంగా మీ ఇంటి దగ్గర ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. విశాలమైన తరగతి గదులు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, అనువైన క్రీడాస్థలాలు కలిగి ఉండటంతో పాటు రూపాయి ఖర్చు లేకుండా ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉచితంగా చదువుకునే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత విద్య చదువుకునే యువతీయువకులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు బడులకు ప్రభుత్వ బడులకు ఉన్న తేడాలను ప్రజలకు వివరించాలని కూడా ఆయన కోరారు.

ప్రతిభకు పదును



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయుల నుంచి మంచి ప్రోత్సాహం ఉంటుంది. విద్యార్థుల్లో దాగిన ప్రతిభను గుర్తించి వారి ఉజ్వల భవిష్యత్‌కు ప్రణాళికలను సిద్ధం చేస్తారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలు ఓ వరమనే చెప్పొచ్చు. విద్యతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి.

– మంగళారం గోవర్దన్, అత్తాపూర్

ఉపాధ్యాయుల ప్రోత్సాహం



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధాయుల నుంచి మంచి ప్రోత్సాహం ఉంటుంది. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసే కార్యక్రమాలు చేపడుతున్నారు. క్రీడాకారులను వారి అభీష్టం మేరకు ప్రోత్సహిస్తున్నారు.

– జి.శివాంశిక, విద్యార్థిని, అత్తాపూర్

సెలబ్రిటీలు చొరవ చూపాలి



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే విషయంలో సెలబ్రిటీలు చొరవ చూపాలి. ప్రభుత్వ పాఠశాలలను వారు దత్తత తీసుకోవడంతోపాటు ప్రకటనల ద్వారా విద్యార్థులను ప్రోత్సహించి వారిని సర్కారు బడుల్లో చేరేలా చైత్యపరచాలి. సెలబ్రిటీల మాటలకు విద్యార్థులు ఆకర్షితులు అవుతారు.

– వి.జైపాల్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి

దోమల వృద్ధిని అరికట్టాలి

ప్రజల్లో అవగాహనతోనే వ్యాధుల నివారణ ◆ రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



మైలార్‌దేవ్‌పల్లిలో అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: దోమలు వృద్ధి చెందకుండా ఎంటమాలజీ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ ఫాగింగ్‌తో పాటు స్ప్రేను పిచికారీ చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మైలార్‌దేవ్‌పల్లిలోని ఎమ్మెల్యే నివాసం నుంచి శివాజీ చౌక్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... డెంగీ జ్వరం దోమల ద్వారా వ్యాపించే వైరల్ వ్యాధి అని, దీని నివారణకు ప్రజల్లో అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పూల కుండీలు, పాత టైర్లు తదితర వాటిలో నీరు లేకుండా చూడాలన్నారు. ఫాగింగ్ మెషిన్లు, స్ప్రే యంత్రాల సహాయంతో దోమల నివారణ చేపట్టాలని అధికారులకు సూచించారు. డెంగీ లక్షణాలు జ్వరం, తలనొప్పి, కీళ్ల నొప్పులు, వాంతులు, దద్దుర్లు వంటివి ఉంటాయన్నారు. డెంగీకు నిర్దిష్టమైన చికిత్స లేదన్నారు. కానీ లక్షణాలను తగ్గించేందుకు వైద్య సహాయం అవసరమన్నారు. రాబోయే వర్షాకాలంలో మలేరియా, డెంగీ వంటి వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటింటా దోమల నివారణకు దోమల తెరలు వాడాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రజల సహకారంతో మాత్రమే దోమలపై విజయవంతంగా పోరాడగలమన్నారు. ఎంటమాలజీ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలమైన విద్యుత్ స్తంభాలను మార్చాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

బండ్లగూడ: శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా తయారైన విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ధాత్రి సోగ్నారె (హుడా) లే అవుట్ వాసులు కోరారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సురేష్‌తో కలిసి శుక్రవారం కమిషనర్ బి.శరత్‌చంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 18వ డివిజన్‌లోని ధాత్రి సోగ్నారె (హుడా) లే అవుట్‌లో విద్యుత్ వీధి దీపాల నిమిత్తం సుమారు 20 ఏళ్ల క్రితం అంటే లే అవుట్ రూపొందించిన కాలంలో ఏర్పాటు చేసిన ఇనుప స్తంభాలు తుప్పుపట్టి ప్రమాదకరంగా మారాయన్నారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. స్థానిక నేతలు ఎం.శివరామిరెడ్డి, కొండా ఆనందరెడ్డి, వి.భాస్కర్‌రెడ్డి, కొంపల్లి కామేష్‌రావు, కొత్త రాజవర్ధన్, జి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

23న నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అత్తాపూర్: హైదర్‌గూడలోని శ్రీ నల్ల పోచమ్మ దేవాలయంలో ఈ నెల 23వ తేదీన అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సోమారం రాజ్‌కుమార్ తెలిపారు. ఆహ్వాన పత్రికను స్థానిక ప్రముఖులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతిష్ఠాపనోత్సవాలలో భాగంగా ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఆలయంలో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. 23వ తేదీన అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఉంటుందన్నారు. దేవాలయాన్ని పునఃనిర్మించి భక్తులకు మెరుగైన వసతులతో ఆధునీకీకరించామన్నారు. ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ మహోత్సవాలకు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. స్థానిక నేతలు సోమవారం రవీందర్, వనం నర్సింహ, మద్దూరి బాలమురళీకృష్ణ, మహేందర్, శ్రీకాంత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల అభివృద్ధికి చర్యలు



హైదర్‌గూడలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న జలమండలి మేనేజర్ శ్రావ్య రెడ్డి

అత్తాపూర్: డ్రైనేజీలను అభివృద్ధి చేస్తూ ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూస్తున్నామని జలమండలి హైదర్‌గూడ మేనేజర్ శ్రావ్య రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హైదర్‌గూడలోని శ్రీ నల్లపోచమ్మ అలయ ఆవరణలో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రావ్య మాట్లాడుతూ... స్థానిక ప్రజలకు, భక్తులకు ఇబ్బందులు లేకుండా డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకీకరిస్తామన్నారు. ప్రజల అవసరాలను బట్టి ప్రత్యేక చర్యలు తీసుకుంటూ పరిష్కార మార్గాలు చూపిస్తున్నామన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో జావీద్, నల్ల పోచమ్మ దేవాలయ కమిటీ అధ్యక్షుడు రాజ్‌కుమార్, గోదల చంద్రయ్య, మద్దూరి శివశంకర్, మద్దూరి బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: పలు సబ్‌స్టేషన్ల పరిధిలో కొత్త సర్వీసుల విడుదల, మెయింటెనెన్స్ పనుల నేపథ్యంలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల ఏఈలు వెల్లడించారు. ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు నార్సింగి–1 సబ్‌స్టేషన్ పరిధిలోని బృందావన్ కాలనీలో, సాయంత్రం 4.30 నుంచి 5 గంటల వరకు గండిపేట, శ్రీనగర్, గ్రేహౌండ్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ మార్కెట్ యార్డ్ సబ్‌స్టేషన్, మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు ఫెయిర్‌ఫీల్డ్ కాలనీ, ఈవీవీ కాలనీ, పయనీర్ కాలనీ, వెంకటేశ్వర కాలనీల్లో విద్యుత్ ఉండదని ఏఈ మణికంఠ తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గిరిగిరి గడ్డ, నార్సింగి గ్రామం, ముప్పా విల్లాస్, ముప్పా అలేఖ్య, నార్సింగి హైట్స్, క్యూబా కాలనీ, క్వాస్పో కాలనీ, వివేకానందనగర్, మంచిరేవుల గ్రామం, మంత్రి విల్లాస్, గ్రీన్ ల్యాండ్స్, జైహింద్ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని అన్నారు.

◆ కోకాపేట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 9.30 గంటల వరకు గోల్డన్ మైల్, 250 గజాల కాలనీ, బాబుఖాన్ విల్లాస్, గ్రాండ్ ఇన్ఫ్రా టెక్ విల్లాస్, దంతు స్వీట్ హౌస్ ప్రాంతాలు, ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు గండిపేట గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన వివరించారు.

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో...

మణికొండ ఏఈ పరిధిలో ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు పుప్పాలగూడ గ్రామం, మారుతీనగర్, దుర్గానగర్, రాఘవేంద్రకాలనీ, గోల్డెన్ ఓరియన్, మానస అపార్ట్‌మెంట్, ఎల్ఐసీ కాలనీ, అలకాపూర్ రోడ్డు నెంబర్ 8 ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు.

◆ ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు అలకాపూర్ రోడ్డు నెంబర్ 13, కూలీ కుతుబ్ షా కాలనీ, పెంటయ్య నగర్, సైక్లా గేటెడ్ కమ్యూనిటీ, వినాయక నగర్ ఫేజ్–2 ప్రాంతాలు, ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు శివాజీనగర్, సుందర్‌గార్డన్, నాగేశ్వర్‌రావు వెంచర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల సర్కిల్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సాయిగౌతం కాలనీ, మాతృశ్రీ కాలనీ, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అలకాపూర్ రోడ్డు నెంబర్ 13 నుంచి 22 వరకు, రోడ్డు నెంబర్ 25, ఆర్‌ఆర్ విలేజ్ పాయింట్, త్రివేణి స్కూల్, గోల్డన్ టెంపుల్, తిరుమలహిల్స్ రోడ్డు నెంబర్ 4, శ్రీరాంనగర్ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ వివరించారు.

బండ్లగూడ: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా హిమాయత్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ బి.అమర్‌సింగ్ తెలిపారు. హైదర్షాకోట్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 10.30 వరకు వెంకటేశ్వర కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రశాంత్‌నగర్, తిరుమల గార్డెన్, రాధా రిట్రీట్స్ ఫేస్–2, పావనీ హార్మనీ విల్లాస్, బచ్‌పన్ స్కూల్, పార్ట్ ఆఫ్ పద్మశ్రీహిల్స్ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

◆ కాళీమందిర్ ఫీడర్‌లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఇండస్ వ్యాలీ, సంజయ్‌గాంధీ నగర్, భవానీ కాలనీ, బైరాగిగూడ, శివసాయినగర్, సుబ్రహ్మణ్య కాలనీ, రంగారెడ్డి కాలనీ, దత్తాత్రేయ కాలనీ, వాల్మీకి ఆశ్రమం, శివపురి, గంధంగూడ గృహాల ప్రాంతాల్లో విద్యుత్ నిలిపేస్తామన్నారు.

◆ స్నేహిత హిల్స్ ఫీడర్‌లో మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు స్నేహిత హిల్స్ ఫేస్–1, 2, బోర్డ్ వ్యారీ హోటల్, స్టోనేజ్ అపార్ట్‌మెంట్స్, ఇండియన్ స్కూల్, రాయ లోక్ ఫర్నీచర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ వివరించారు.

ఎంసెట్ ర్యాంకర్‌కు సన్మానం

మణికొండ: ఇటీవల ప్రకటించిన ఎంసెట్ ఫలితాలలో మణికొండ క్వార్టర్స్‌కు చెందిన బాలస్వామి కుమార్తె జోత్స్న 1964వ ర్యాంక్ సాధించింది. మణికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి, నాయకులు ఆమెను శుక్రవారం సన్మానించి అభినందించారు. ఉత్తమ కళాశాలలో ఇంజనీరింగ్ సీటు పొంది ఉన్నత స్థాయికి ఎదిగేలా చదువుకోవాలని సూచించారు. చదువుల గురించి రాబోయే రోజుల్లో ఎలాంటి సహాయం కావాలన్నా అడగాలని, తమ వంతు సహాయం చేస్తామని హామి ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు బి.శ్రీరాములు, మాల్యాద్రినాయుడు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన్ నిర్మించండి



మణికొండ: అంబేడ్కర్ భవన్ నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో రూ. 45 లక్షల నిధులను మంజూరు చేసినా అందుకు సంబంధించిన పనులు చేపట్టకపోవటం తగదని, వెంటనే నిర్మాణ పనులను ప్రారంభించాలని బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం, కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. ధన్‌రాజ్‌లు డిమాండ్ చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడలో 2019వ సంవత్సరంలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి రూ. 45 లక్షలు మంజూరు అయ్యాయన్నారు. నిర్మాణ పనులు చేపట్టేందుకు శంకుస్థాపన సైతం చేశారని, అయినా ఇప్పటి వరకు పనులను ప్రారంభించకపోవటం విడ్డూరమన్నారు. ఇకనైనా ఎలాంటి తాత్సారం లేకుండా పనులను ప్రారంభించాలని, లేదంటే వారం రోజుల్లో మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ పార్టీ పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. ఆ విషయాన్ని మరోమారు శుక్రవారం లేఖ రూపంలో మున్సిపల్ కమిషనర్‌కు తెలిపామన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

శాస్త్రిపురం: సులేమాన్‌నగర్ డివిజన్‌లోని ప్రధాన రహదారులపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయనందున తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. చింతల్‌మెట్‌లోని వీరన్నకుంటకు వెళ్లే ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్‌లు లేవు. దీంతోపాటు సులేమాన్‌నగర్, ఎం.ఎం.పహాడీ, వాదియామహ్మద్, శాస్త్రీపురం ప్రధాన రహదారులపై స్పీడ్ బ్రేకర్లు లేవు. దీంతో వాహనదారులు రయ్యిమంటూ దూసుకు పోతున్నారు. ఫలితంగా చిన్నారులు, విద్యార్థులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వృద్ధులు, మహిళలు రోడ్లపైకి రావాలంటేనే జంకుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పీడ్ బ్రేకర్ల ఆవశ్యకతను గుర్తించి ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు భద్రత, ఆర్థిక భద్రత అవసరం



నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

రాయదుర్గం: జీవితం, కుటుంబంను రక్షించడంలో రోడ్డు భద్రత, ఆర్థిక భద్రత రెండూ నాణేనికి రెండు ముఖాలని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ,సీఈఓ కాస్పరస్ జే.హెచ్ ,క్రోమ్హాట్ పేర్కొన్నారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ), సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ హెల్మెట్ రోడ్డుపై జీవితాలను రక్షించగలిగినట్లే, లైఫ్ ఇన్సూరెన్స్ కుటుంబాలకు ఫైనాన్షియల్ హెల్మెట్‌లాగా పనిచేస్తుందన్నారు. 2047 నాటికి అందరికీ ఇన్సూరెన్స్ ప్రయత్నంలో భాగంగా ఆర్థిక భద్రతను అందించడంపై శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ ఎస్‌సీఎస్‌సీ, ట్రాఫిక్ పోలీసులతో కలిసి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. అనంతరం శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ నుంచి హెల్మెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. రోడ్డు, భద్రత, రక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సైబరాబాద్ ట్రాఫిక్ అధికారులు, ఎస్‌సీఎస్‌సీ ప్రతినిధులు, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మహా ‘చెత్త’ ప్రాంగణం!



మహానగర్ కాలనీలోని క్రీడా ప్రాంగణం దుస్థితి

మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా శంషాబాద్ పట్టణంలోని క్రీడా ప్రాంగణాల తీరు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. ప్రధానంగా నాలుగో వార్డు పరిధిలోని మహానగర్ కాలనీలో ఉన్న క్రీడా ప్రాంగణం కాస్తా పిచ్చిమొక్కలతో నిండిపోయి డంపింగ్ యార్డును తలపిస్తున్నది. ఆ క్రీడా ప్రాంగణమంతా చెత్తమయంగా మారింది. అందులో ఏర్పాటు చేసిన కొన్ని వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారు. అక్కడక్కడ కొన్ని ఇనుపరాడ్లు మాత్రమే దర్శనమిస్తున్నాయి. ఇక్కడ క్రీడా ప్రాంగణం ఉందనే సంగతి బోర్డు చూస్తే మాత్రమే తెలుస్తుందంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. – శంషాబాద్